

అనాథలకు భరోసా

మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ బాలబాలికలకు భరోసా కల్పించేలా ప్రతినెలా రూ.4 వేలు ప్రభుత్వం అందించనుంది.

- 8లో..



లాసెట్‌లో మనోళ్ల సత్తా

లాసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మూడేళ్ల కోర్సులో స్టేట్ 2వ ర్యాంకు, ఐదేళ్ల కోర్సులో స్టేట్ 3వ ర్యాంకు సాధించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
43.4/32

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికం. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పొగాకు కిలో ధర రూ.248

ఒంగోలు రూరల్: పొగాకు వేలంలో గరిష్ట ధరలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఒంగోలు రూరల్‌లోని పొగాకు వేలం కేంద్రం -2లో శుక్రవారం పొగాకు గరిష్ట ధర కిలో రూ.248 పలికింది. ఈ సీజన్‌లో ఇదే గరిష్ట ధర. వేలం కేంద్రానికి 552 బేళ్లు రాగా 623 బేళ్లు కొనుగోలు చేశారు. 5 బేళ్లు నోబిడ్ కాగా గరిష్ట ధర రూ.248, కనిష్టం రూ.165, సరాసరి ధర రూ.236.55గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

మరోసారి పెరిగిన పొగాకు ధరలు

కందుకూరు: నిన్నటి వరకు కేజీ పొగాకు అత్యధిక ధర రూ.240 ఉండగా శుక్రవారం వేలంలో మరో రూ.9 రేటు పెరిగి ఈ సీజన్‌లో అత్యధిక ధర నమోదు చేసింది. కందుకూరు-1 వేలం కేంద్రంలో 891 బేళ్లను వేలానికి ఉంచగా 826 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 615 బేళ్లకు గాను 521 బేళ్లు అమ్ముడు పోయాయి. ఒకటో వేలం కేంద్రంలో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.248 రాగా, రెండో వేలం కేంద్రంలో రూ.249 పలికింది. అత్యల్ప ధరలు వరుసగా రూ.160, రూ.161 నమోదయ్యాయి. దీంతో సీజన్ సరాసరి ధరలు కూడా రికార్డు స్థాయిలో రూ.240 నమోదు కావడం గమనార్హం.

అరోమా మిషన్ సాగుకు ప్రణాళికలు

- వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు: అరోమా మిషన్ సాగుకు విధి విధానాలు తయారుచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాలులో శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహామండలి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాండ్ క్లాసిఫికేషన్‌కు సంబంధించిన పటాన్ని తయారు చేయాలన్నారు. అరోమా మిషన్ సాగుకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల స్థాయిలో రైతులను ఎంపికచేసి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే అరోమా మిషన్ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించి శిక్షణ క్యాలెండర్‌ను తయారు చేయాలని, వీటిని పొదుపు సంఘాల్లాగా నడిపించి బ్యాంకుల నుంచి రైతులు రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ భూములకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పంట రుణాలు ఇచ్చే క్రమంలో జియో ట్యాగింగ్‌తో పనిలేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ప్రతి నెలా జరిగే సమావేశానికి డీసీసీ, ఏపీజీబీ, విద్యుత్ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. టార్పాలిన్ పట్టలను రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ బ్యాంకు అధికారులు పంట రుణాలు ఇచ్చే క్రమంలో రైతులను ఇబ్బంది పెట్టరాదన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌లో డీడీలు కట్టి కూడా సామగ్రి అందని రైతుల వివరాలను తయారుచేసి వారికి త్వరగా అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.

తమిళ దొంగలు మామూలోళ్లు కాదు..!

తమిళనాడుకు చెందిన ముగ్గురు యువకులు.. గతంలో బాలనేరస్తులు. అడపాదడపా దొంగతనాలు చేస్తూ జైలుకు వెళ్లారు. ఆ సమయంలో వారి మధ్య స్నేహం ఏర్పడింది. చిత్తు కాగితాలు ఏరుకుంటున్నట్టు నటిస్తూ చోరీలకు స్కెచ్ వేయడం.. కేవలం ఇనుపరాడ్డునే ఆయుధంగా ఉపయోగించుకుని ఇళ్లను కొల్లగొట్టేయడంలో ఆరితేరారు. ఎవరూ గుర్తించకుండా బైక్‌లపై హెల్మెట్లతో సంచరిస్తున్న ఈ గజదొంగలు.. సినీ ఫక్కీలో చోరీలకు తెగబడుతూ రెండు జిల్లాల పోలీసులను ముప్పతిప్పలు పెట్టారు. అన్నీ భారీ దొంగతనాలే.. చివరకు సింగరాయకొండలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చేసిన చోరీ వీరి ఆచూకీని పట్టించింది. పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు! విచారణలో వారు వెల్లడించిన విషయాలు విని పోలీసులే విస్తుపోతున్నారు.



- స్కెచ్చేస్తే చోరీనే..

- ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో దోపిడీలు
- చెత్త కాగితాలు ఏరుకుంటూ ఇళ్లలో దూరి..
- పట్టించిన సీసీ టీవీ కెమెరాలు
- పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు
- గతంలో ముగ్గురూ బాలనేరస్తులే..
- భారీగా బంగారం, వెండి, నగదు పట్టివేత
- కేసును ఛేదించిన సింగరాయకొండ పోలీసులు ?

సింగరాయకొండ:

కొద్దిరోజులుగా నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఓ ముఠా చోరీలకు పాల్పడుతూ పోలీసులకు నిద్రలేని రాత్రులను మిగిల్చింది. రాత్రీపగలు తేడా లేకుండా జరుగుతున్న దొంగతనాలు, నెల్లూరు, ఒంగోలు, సింగరాయకొండ, గూడూరు- సూళ్లూరుపేట మధ్య జాతీయ రహదారిపై వరుస దోపిడీలను జిల్లా పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో రెండు బృందాలు దొంగల పనిపట్టేందుకు రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా సాగిన దర్యాప్తులో దోపిడీకి పాల్పడింది ముగ్గురు యువకులని గుర్తించారు. తమిళనాడు గుమ్మడిపూండి సమీపంలో స్మగ్లర్లకు కేంద్రంగా ఉండే మింజూరు ప్రాంతానికి చెందిన వారుగా తెలుసుకుని వారిని అదుపులోనికి తీసుకున్నట్టు సమాచారం. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.

జైలులో స్నేహంగా మారి..

తమిళనాడు గుమ్మడిపూండి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన యువకులు చిన్నప్పుడు చిత్తు కాగితాలు ఏరుకుంటూ అడపాదడపా నేరాలకు పాల్పడేవారు. బాలనేరస్తులుగా వీరు జైలు జీవితం గడిపారు. ఆ సమయంలో ముగ్గురు యువకులు స్నేహితులయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత రెండుమూడేళ్ల పాటు ఎటువంటి దొంగతనాలకు పాల్పడకుండా పోలీసుల దృష్టిలో మంచివారుగా ముద్ర వేసుకున్నారు. పోలీసులు పట్టించుకోవటం మానేశారని నిర్ధారించుకున్న యువకులు చోరీలకు పథక రచన చేశారు. తమిళనాడులో కాకుండా పొరుగు రాష్ట్రం ఆంధ్రాలో చోరీలకు పాల్పడితే తమిళ పోలీసులకు అనుమానం రాదని భావించారు.



ఈనెల 12న ఉపాధ్యాయ దంపతుల ఇంటిలో జరిగిన చోరీని పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ (ఫైల్)

సింగరాయకొండ చోరీతో అప్రమత్తమైన పోలీసులు

సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్‌లో నివసిస్తున్న ఉపాధ్యాయ దంపతుల ఇంట్లో పట్టపగలే ఈనెల 12వ తేదీన ముగ్గురు యువకులు సుమారు 36 సవర్ల బంగారం, అర కేజీ వెండిని అపహరించారు. బాధితురాలి కళ్ల ముందు నుంచే బైక్‌పై ఉడాయించిన ఆ ముగ్గురు దొంగలు సీసీ టీవీ ఫుటేజీలో అడ్డంగా దొరికారు. జాతీయ రహదారిపై నెల్లూరు వైపు వెళ్లినట్లు నిర్ధారించుకున్న సింగరాయకొండ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నెల్లూరు మీదుగా చిత్తూరు జిల్లా తడ చెక్‌పోస్టు దాటి తమిళనాడు రాష్ట్రంలోకి ప్రవేశించిన ముగ్గురిలో ఒకరు మింజూరు వద్ద దిగిపోగా, మరో ఇద్దరు ముందుకెళ్లారు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో విచారించి ముగ్గురూ పాత నేరస్తులేనని నిర్ధారించుకున్న జిల్లా పోలీసులు.. వలపన్ని వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వాస్తవానికి మింజూరు ప్రాంతం స్మగ్లర్లు, దొంగలకు అడ్డా. అంతేకాక కొంతమంది యువకులను మత్తుమందుకు బానిసలను చేసి పెట్టుబడి పెట్టి మరీ దొంగతనాలు చేయిస్తుంటారు.



ఈనెల 1న రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి ఇంటిలో జరిగిన చోరీని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్ (ఫైల్)

ఇనుపరాడ్డే ఆయుధం

వీరు చోరీకి రెక్కీ చేశారంటే విజయవంతంగా పని ముగించుకుని తిరిగెళ్లాల్సిందే. ఆ విధంగా ఉంటుంది వీరి స్కెచ్. దోపిడీకి నిర్ణయించుకున్న ప్రాంతంలో వీరు ముందుగా బైక్ చోరీ చేసి దాని కండిషన్ పరీక్షించుకుంటారు. పని పూర్తయిన తర్వాత ఆ బైక్‌ను ఎక్కడో ఒకచోట వదిలేసి పరారవుతారు. చోరీలకు పాల్పడిన ప్రతి చోటా ప్రత్యేకంగా తయారుచేసుకున్న ఇనుపరాడ్‌ను మాత్రమే వాడారు. తమ ఆనవాలు గుర్తించకుండా హెల్మెట్లు వాడుతూ జాగ్రత్తపడ్డారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసై తాము దోచుకున్న బంగారాన్ని అతి తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటారని పోలీసు వర్గాలు తెలియజేస్తున్నాయి.







సీసీ టీవీ ఫుటేజ్‌కి చిక్కిన తమిళ దొంగలు

చోరీలు ఇలా..

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో జరిగిన పలు భారీ చోరీల్లో వీరి హస్తం ఉంది. ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆశ్రమం వద్ద, టీచర్స్ కాలనీలో జరిగిన రెండు భారీ దొంగతనాలు, ఒంగోలు ఒన్‌టౌన్ పరిధిలో ఒకటి, నెల్లూరు నగరం, రూరల్ ఏరియాలోని నగరి, కొడవలూరు, గూడూరు-సూళ్లూరుపేట మధ్యలో జాతీయ రహదారిపై పలు దొంగతనాలు, సింగరాయకొండలో ఈనెల 12వ తేదీన ఉపాధ్యాయ దంపతుల ఇల్లు, మూలగుంటపాడులోని రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి గృహంలో జరిగిన చోరీలు వీరే చేసినట్టు సమాచారం. అంతేకాక సింగరాయకొండలోని పట్టాభివారి వీధిలో సాంబిరెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలు కూడా దొరికారని, సొత్తు రికవరీ చేసే పనిలో పోలీసులు ఉన్నారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

అణగారిన వర్గాల ఆత్మబంధువు సీఎం జగన్

- జగన్ పాలనలోనే రాజ్యాధికారం దిశగా దళితుల అడుగులు
- ఆత్మీయ సమ్మేళనం పేరుతో టీడీపీ మరోమారు దళితులను దగా చేసేందుకు యత్నం
- వర్ల రామయ్యకే అన్యాయం జరిగినా ఆయన ఇంకా చంద్రబాబు వైపు మాట్లాడడం దేనికి సంకేతం
- మీడియా సమావేశంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ



మాట్లాడుతున్న కొమ్మూరి కనకారావు మాదిగ

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అణగారిన వర్గాల ఆత్మీయ బంధువు అని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో దళితులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఏనాడూ దళితుల పట్ల ఆపేక్ష లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం ఇద్దరికి మంత్రిపదవులు, నలుగురికి నామినేటెడ్ పోస్టులు చంద్రబాబు కేటాయిస్తే నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదుగురికి మంత్రి పదవులు, 15 మందికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులతోపాటు ఇంకా జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ఎక్కువగా పదవులు ఇచ్చారన్నారు. రాజ్యసభ సీటు ఇస్తాను రమ్మని వర్ల రామయ్యకు కబురు పంపి ఆయన కరకట్ట వద్దకు వచ్చేసరికి తూచ్ అంటూ మరొకరికి కట్టబెట్టిన ఘనత చంద్రబాబుదన్నారు. బాబు నేడు మాయమాటల పేరుతో మరోమారు దగా చేసేందుకు జనం ముందుకు వస్తున్నారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 75 సంవత్సరాల దేశ చరిత్రలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక ఫలాలు అందాలని, ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం తీసుకొచ్చి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయిస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో దళితుల పేర్లతో ఓసీలకు ఇన్నోవా కార్లు ఇచ్చి దారుణంగా మోసం చేశారని విమర్శించారు. దళితులకు ద్రోహం చేసిన చంద్రబాబు పంచన చేరి ఆత్మద్రోహం చేసుకుంటూ జగన్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పూలే వంటి మహనీయులు ఆకాంక్షించినట్లుగా నేడు దళితులు నవరత్నాల సాక్షిగా చైతన్యం అవుతున్నారని, తప్పుడు ప్రచారం విని మోసపోయే పరిస్థితులు లేవన్నారు. చంద్రబాబు హయాంలో దళితులకు రుణాలు ఎంతమందికి ఇచ్చారు, నేడు రుణం కాకుండా నేరుగా ఆర్థిక సాయం మా ప్రభుత్వం ఎలా ఇస్తుందో కూడా చర్చించేందుకు బహిరంగ సవాల్‌కు సిద్ధం కావాలన్నారు. దశాబ్దాలు గడుస్తున్నా సొంత ఇల్లు కూడా లేకుండా అణగారిన వర్గాలు విలవిల్లాడుతుంటే కోర్టుకు వెళ్లి ఇళ్లపట్టాలు ఆపించడం, ఆంగ్ల మాధ్యమం అణగారిన వర్గాలకు అందకుండా చేసేందుకు కుట్రలు పన్నడం ఇలా ఎన్నో రకాలుగా మోసం చేస్తున్నది టీడీపీ మాత్రమే అన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా లబ్ధిపొందిన ప్రజానీకం ఆత్మద్రోహం చేసుకునేందుకు సిద్ధంగా లేరని, 2024 ఎన్నికల్లో మరో మారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే అని స్పష్టం చేశారు. ఎన్‌టీఆర్ హయాంలో టీడీపీకి వెన్నుదన్నుగా ఉన్న బీసీలను సైతం చంద్రబాబు ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించారని, కానీ నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజానికి బ్యాక్ బోన్ అంటూ ఆత్మస్థైర్యం నింపారన్నారు. దీంతో బీసీలు సైతం టీడీపీకి చరమగీతం పాడారని, మాదిగ ఆత్మీయ సమ్మేళనం, మాలల ఆత్మీయ సమ్మేళనం పేరుతో మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలతో తులతూగుతున్న గ్రామాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- మెరుగుపడిన పేదల ఆర్థిక పరిస్థితులు
- గడప గడపలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: నియోజకవర్గంలోని గ్రామాలన్నీ సంక్షేమ పథకాలతో తులతూగుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు. మువ్వవారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక లబ్ధిదారులు, పార్టీ నాయకులతో వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా నిరంతరం అందిస్తున్న సంక్షేమ పథకాల వలన పేదల జీవితాల్లో వెలుగులు కనిపిస్తున్నాయని, వారి జీవన స్థితిగతులు మారాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు. ఆ నగదును సద్వినియోగం చేసుకొని పేదల కుటుంబాలకు చెందిన మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తున్నారన్నారు. పలు పథకాల ద్వారా ప్రతి ఇంటికి సరాసరిన రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని గుర్తు చేశారు. తొలుత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబును ఘనంగా గ్రామంలోకి ఆహ్వానించారు. శాలువాలతో సత్కరించి హారతులతో స్వాగతం పలికారు. మువ్వవారిపాలెం వడ్డెరపాలెంలో స్థానికులకు తాగు నీటి సమస్య ఉండటంతో దానిని పరిష్కరించి రామతీర్థం రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని అందించాలని వెంకాయమ్మ, సుధాకర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి త్వరలో వడ్డెరపాలెం కాలనీ వాసులకు మంచినీటి వసతిని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు తన్నీరు నాగ ఇందిర శ్రీనివాసరావు, సొసైటీ ప్రెసిడెంట్ బొడ్డు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంచాల రాంబాబు, చింతపట్ల బ్రహ్మయ్య, పులి శ్రీనివాసరావు, రావులపల్లి కోటేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాబోయ్.. సెగలు

తారెత్తిస్తున్న ఎండలు





ఒంగోలు సబర్బన్: భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మండే సూర్యుడు ఎండలను తారెత్తిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే భానుడు భగభగమంటుండటంతో ప్రజలు బయటకు రావటానికే భయపడుతున్నారు. నైరుతీ రుతు పవనాలు కొంత ఆలస్యమైనా రెండు రోజుల క్రితం రాయలసీమను తాకాయి. అయినా వాటి ప్రభావం వాతావరణం మీద పెద్దగా చూపటం లేదు. అరేబియా సముద్రంలో వరుసగా రెండు తుఫాన్లు రావటంతో నైరుతీ రుతు పవనాలకు ప్రతి బంధకాలుగా మారాయి. వరుసగా వచ్చిన మోకా, బిపర్ జోయ్ తుఫాన్ల వల్ల నైరుతి రుతు పవనాలు కూడా వాతావరణాన్ని చల్లబరచలేకపోతున్నాయి. దీంతో ఒంగోలు నగరంలో వారం రోజులుగా నిత్యం 41 నుంచి 43 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్టం 32 డిగ్రీలుగా నమోదయ్యాయి. 43.4 డిగ్రీలు చూపిస్తున్నా అది కాస్తా 46 డిగ్రీల స్థాయి ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇక జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో 48 డిగ్రీల స్థాయి ఉష్ణోగ్రతలతో ప్రజలు బయట అడుగుపెట్టాలంటేనే ఉలిక్కి పడుతున్నారు. ఇక పశుపక్షాదుల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. రాత్రి 9 గంటల వరకు కూడా సెగ గాలులు తగ్గటం లేదు. సాధారణంగా రోహిణీ కార్తెలో కాసిన ఎండలకు రోళ్లు పగులుతాయంటారు. రోహిణీలో కూడా ఈ స్థాయి ఎండలు తారెత్తించలేదు. రోహిణీ కార్తె ఈ నెల 10వ తేదీతో వెళ్లిపోయింది. మృగశిర కార్తె కూడా వచ్చేసింది. అయినా భానుడి ప్రతాపం తగ్గడం లేదు. మరో పక్క రైతులు కూడా ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్నారు. జూన్ 15 నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికే ఏరువాకను ప్రారంభించుకున్న జిల్లా రైతాంగం ఇప్పటికే పంటలను సాగు చేయటం ప్రారంభించారు. వేడి గాలులు తగ్గిన తరువాత పూర్తి స్థాయిలో పొలాల్లో అడుగుపెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు సువర్ణావకాశం

ఒంగోలు: జిల్లాలోని హైస్కూలు ప్లస్‌లో పనిచేసేందుకు ఆసక్తిగల స్కూల్ అసిస్టెంట్లు శనివారం స్థానిక డీఈవో కార్యాలయానికి నేరుగా సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలని డీఈవో పి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి జెడ్పీహెచ్ఎస్(ఆంగ్లం), సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిద్దలూరు జెడ్పీహెచ్ఎస్ (కెమిస్ట్రీ), అద్దంకి మండలం తిమ్మాయపాలెం, చీమకుర్తి మండలం దేవరపాలెం, ఇంకొల్లు, జె.పంగులూరు మండలం బూదవాడ జెడ్పీహెచ్ఎస్ లు, కొండపి మండలం ఉప్పలపాడు జెడ్పీహెచ్ఎస్ (జువాలజీ), మార్టూరు మండలం వలపర్ల జెడ్పీహెచ్ఎస్, సింగరాయకొండ మండలం పాకల జెడ్పీహెచ్ఎస్ (కామర్స్) పోస్టుల్లో పనిచేసేందుకు ఆసక్తితోపాటు సంబంధిత అర్హతలు కలిగి ఉన్నవారు మాత్రమే హాజరుకావాలన్నారు.



క్లుప్తంగా

పేస్‌లో 'నారాయణ అండ్ కో' సందడి



విద్యార్థులతో మాట్లాడుతున్న చిత్ర బృందం

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం నారాయణ అండ్ కో సినీ యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కాలేజీని సందర్శించి విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. చిత్ర కథానాయకుడు సుధాకర్ కామూకల, కథానాయిక ఆర్తి, దర్శకుడు చిన్న పాపిశెట్టి, నటి ఆమని తదితరులు మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించామని, ముఖ్యంగా యువతను ఈ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పారు. చిత్ర యూనిట్‌ను కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ ఘనంగా సత్కరించారు.

పోలీసుల సంక్షేమం కోసమే గ్రీవెన్స్ డే



గ్రీవెన్స్ డేలో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: పోలీసుల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సంక్షేమ దివస్ నిర్వహిస్తున్నామని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, హోంగార్డులు ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీ సాధ్యమైనంత త్వరగా తగిన పరిష్కారాన్ని చూపుతామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి డీపీఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వృత్తిపరంగా, ఆరోగ్యపరంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ డేను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీపీఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, ఎస్సై భవాని తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ సీజ్ చేయాలి

- కనిగిరి ఎంఈఓకు ఏఐఎస్ఎఫ్ వినతి

కనిగిరి రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈఓ జె.ప్రసాద్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఎటువంటి అనుమతులు లేవని విద్యా శాఖ ఉన్నతాధికారులు నారాయణ స్కూల్‌ను సీజ్ చేసినా.. సెలవుల తర్వాత తిరిగి పాఠశాలను ప్రారంభించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రభుత్వ జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు ఎదురుగా నారాయణ స్కూల్ నిర్వహించడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పవన్ కళ్యాణ్, సయ్యద్ ఇఫ్రాజ్, చైతన్య, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు భరోసా!

- నిరుపేదలు, సంరక్షణ లేని బాలబాలికలకు అండగా 'వాత్సల్య'
- 2023–24 ఆర్థిక సంవత్సరానికి 27,800 మంది ఎంపిక
- ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం
- త్వరలోనే ఖాతాల్లో నగదు జమ చేయనున్న ప్రభుత్వం



బాధితులకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్(ఫైల్)

దర్శి:

అనాథలు.. ఎవరూ లేని అభాగ్యులను ఆదుకోవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నూతనంగా మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ బాలబాలికలు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించడానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించాయి. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.2,600, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,400 కలిపి ప్రతి నెలా రూ.4 వేలు అందించేలా పథకానికి రూపకల్పన చేశారు. పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు వాత్సల్య పథకానికి అర్హులు.

☛ స్త్రీ శిశుసంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బంది ఇటీవల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 4,545 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను 27,800 మంది వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో పీఎం కేర్స్ పేరుతో ఈ పథకం ఏప్రిల్ 2022–23లో అమలులోకి వచ్చినప్పటికీ అప్పుడు 218 మంది లబ్ధిదారులకు నెలకు రూ.500 చొప్పున రూ.1,09,000, కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన 16 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రూ.3.20 కోట్ల నగదును వారి ఖాతాలకు జమ చేశారు. అప్పట్లో అవగాహన లేక కొద్ది మంది మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు.

2023–24 ఆర్థిక సంవత్సరానికి 27,800 మంది ఎంపిక

ఈ ఏడాది క్షేత్ర స్థాయిలో మిషన్ వాత్సల్య పథకంపై ఐసీడీఎస్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించడంతో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినప్పటికీ అర్హత ఉన్న 27,800 మందిని ఎంపిక చేశారు. నిధులు కూడా త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం ద్వారా తల్లిదండ్రులను కోల్పోయి బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్నవారు, కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయినవారు, దివ్యాంగులు, హింసకు గురవుతున్నవారు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడేవారు, ఆర్థిక స్తోమత లేనివారు, యాచకులు, పునరావాసం కోసం ఎదురుచూసే బాలబాలికలు, వితంతువుల పిల్లలు వాత్సల్య పథకానికి అర్హులు.

అర్హులైన లబ్ధిదారుల వివరాలివీ..

- తల్లి, తండ్రిని కోల్పోయి బంధువుల దగ్గర ఆశ్రయం పొందుతున్న బాలురు 337 మంది, బాలికలు 297 మంది
- తల్లి లేదా తండ్రి లేని బాలురు 12,015, బాలికలు 10,692
- హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు బాలురు 91, బాలికలు 95
- దివ్యాంగులైన తల్లిదండ్రుల పిల్లలు బాలురు 336, బాలికలు 291
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి పిల్లలు బాలురు 238, బాలికలు 215
- ఒంటరి మహిళల పిల్లలు, భర్తలు వదిలేసిన, ఆదరణ లేని మహిళల పిల్లలు బాలురు 1,415, బాలికలు 1,425
- తల్లి, తండ్రి ఉండి పెంచే స్థితిలేని వారి పిల్లలు బాలురు 25, బాలికలు 23
- వీరందరిలో బాలురు 14,487 మంది కాగా బాలికలు 13,313 మంది ఉన్నారు.

త్వరలోనే అర్హులకు లబ్ధి



జిల్లాలో మిషన్ వాత్సల్య పథకంపై జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ కె.మాధురి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హులు దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకున్నాం. ఈ పథకం ద్వారా నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథలు, అభాగ్యులు, పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి నెలా రూ.4వేలు అందజేస్తాయి. ఈ ఏడాది ఊహించని విధంగా 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 27,800 మంది అర్హత సాధించారు. వీరందరికీ త్వరలోనే నగదు అందిస్తారు.

– పి.దినేష్‌కుమార్, డీసీపీఓ

స్వచ్ఛ ఓటు నమోదు కావాలి



చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాస్ తదితరులు

ఒంగోలు: జిల్లాలో నూరు శాతం స్వచ్ఛ ఓటు నమోదు కావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చీఫ్ ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం శుక్రవారం జిల్లాలోని ఈఆర్‌వోలకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు, తొలగింపులు నూరు శాతం నిక్కచ్చిగా ఉండాలన్నారు. ఎన్నికల ముందు కాబట్టి ఫారం 6, 7, 8ను క్షుణ్ణంగా పరిశీలించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి విచారణ చేపట్టాలన్నారు. సరిగా లేకపోతే ముందుగా నోటీసు ఇచ్చి అనంతరం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని, ఒకే ఇంట్లో పది ఓట్లు, డోర్ నెంబర్ లేని ఓటర్లను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. బీఎల్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని, ఇప్పటికే పదిమందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బీఎల్‌ఓలతో ఈఎల్‌వోలు తరుచూ సమావేశమవుతూ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో ఫొటోలు తప్పుగా ఉంటే వాటిని సవరించాలని, జూలైలో జరిగే ఇంటింటి పరిశీలనలో చాలా నిక్కచ్చిగా ఓటర్ల జాబితాను బీఎల్‌ఓలు తయారు చేయాలని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు ఎవరూ రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొనరాదని, అటువంటి సంఘటనలు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. త్వరలో బీఎల్‌వోలకు డివిజన్ల వారీగా సమావేశాలు ఉంటాయని, ఎన్నికల వేడి ప్రారంభమైన దృష్ట్యా విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



దర్శిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: నవరత్నాలతో పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దర్శి పట్టణంలోని ఎనిమిదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే మద్దిశెట్టి ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలు అందని వారికి కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికే సాధ్యమైందన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతూ ఉంటే ప్రజలకు ఏం కావాలో ఇట్టే తెలిసిపోతోందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 175కు 175 సీట్లు రావడం ఖాయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, ఎంపీటీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, కౌన్సిలర్ జ్యోతి, బూబారావు, బీసీ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైపీ సుబ్బయ్య, తాళ్లూరు ఎంపీపీ, జెడ్పీటీసీలు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

లంకోజనపల్లిలో..

సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. లంకోజనపల్లి రోడ్డు నాలుగో సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గడప గడపకు వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో రోడ్లు, కరెంట్, తాగునీరు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

అట్రాసిటీ కేసుల్లో జాప్యం తగదు

- ఎస్పీ మలిక గర్గ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఒంగోలు, దర్శి, కనిగిరి, మార్కాపురం సబ్ డివిజన్ డీఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం నమోదు చేసిన కేసులు, డీఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్న కేసులపై సమీక్షించారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి, అందుకుగల కారాణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల సత్వర పరిష్కారానికి అవసరమైన సూచనలు, సలహాలతో మార్గదర్శకాలను జారీ చేశారు. దర్యాప్తు పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులను అరెస్టు చేయడంతోపాటు తగిన సాక్ష్యాధారాలతో నిర్ణీత సమయంలోగా చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అట్రాసిటీ కేసుల విచారణలో నిస్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అట్రాసిటీ కేసుల నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దర్యాప్తు చేస్తున్న అత్యాచారం, పోక్సో, మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలు, మోసాలు, దొంగతనాలు, భౌతిక దాడులు, రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని, ఆధారాలను, సాక్ష్యాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించాలని, నిర్ణీత సమయంలోగా చార్జిషీట్ దాఖలు చేయాలని, పోక్సో కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి వీలైనంత త్వరగా ట్రేస్ చేయాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి పూట బీట్ వ్యవస్థను పటిష్టపరిచి పెట్రోలింగ్ పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీటీసీ సీఐ ఎం .శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అస్థిపంజరం లభ్యం

- గోపాలపురానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

పామూరు: మతిస్థిమితం లేక ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తి గ్రామ సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై సురేష్‌యాదవ్ తెలిపిన వివరాలు.. పామూరు మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పినికిచర్ల నారాయణ ఏడాది క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. ఇంటి పట్టున కుదురుగా ఉండకుండా బయట తిరుగుతూ రెండు, మూడు రోజులకు ఓసారి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది సంక్రాంతి పండుగ తరువాత ఇంటి నుంచి వెళ్లిపోయిన నారాయణ రాక కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తూ ఉన్నారు. అదే గ్రామానికి చెందిన వెంకయ్య అనే వ్యక్తి పాత చెరువులో గొర్రెలను మేపుతున్న సమయంలో ఎముకలగూడు ఆనవాళ్లను చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు, మృతుని భార్య సుభాషిణి అక్కడి ఆనవాళ్లు చూసి నారాయణ(33)గా గుర్తించి విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు **శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరీ పీఠము కుర్తాళం స్వామి వారైన శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి** గారిచే General Power Of attorney పొందిన **తిరుపతి ముని కృష్ణయ్య** గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఒంగోలు లోని సిద్ధేశ్వరీ పీఠ పాలిత షిర్డీ సాయి కల్చరల్ ట్రస్ట్ మరియు మిషన్‌కు సంబంధించిన అన్ని పరిపాలనా వ్యవహారములు చూచుకొనుటకు మా క్లయింటును శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి గారు తన తరుపున GPA Holder గా నియమించియున్నారు.

శ్రీ షిర్డిసాయి కల్చరల్ ట్రస్ట్ మరియు మిషన్‌లో ఇదివరలో సభ్యులు గా ఉన్న (1) మల్లాది సుబ్బలక్ష్మి, (2) పొత్తూరి గోపాలరావు, (3) మేడా జయరాం, (4) డా॥ రావిపాటి ప్రసాదరావు, (5) దాసిరి అంజయ్య, (6) బయ్యారపు పిచ్చయ్య, (7) యల్లాప్రగడ సాయి బాబు, (8) గంజాం విజయ శివ కుమార్, (9) పొత్తూరి సాయిరాజ్, (10) గాలి లక్ష్మీ సుధారాణి, (11) ఎస్ హరనాథరెడ్డి, (12) టి.హేమచంద్రారెడ్డి, (13) వల్లపల్లి శ్రీధర్ అనువారలను పీఠాధిపతిగారైన మహా స్వామి గారు సదరు శ్రీ షిర్డిసాయి కల్చరల్‌ట్రస్ట్ మరియు మిషన్‌కు సభ్యులుగా కొనసాగుటకు అర్హత కోల్పోయినారని, వారు సభ్యులుగా ఉండుటకు అర్హత లేదని వారిని సభ్యులుగా తొలగించుచూ వారికి ఉత్తర్వులు సహా పంపియున్నారు. సదరు సభ్యులకు షిర్డి సాయి కల్చరల్ ట్రస్ట్ మరియు మిషన్‌కు ఎటువంటి సంబంధము లేదు. అంతే గాక ప్రస్తుత సభ్యులైన మద్దులూరి రాంబాబు, టి. హరిప్రియ మరియు కె.ప్రమీలాదేవి అనువారు సభ్యులుగా కొనసాగుచూ, శ్రీ షిర్డిసాయి కల్చరల్ ట్రస్ట్ మరియు మిషన్ యొక్క కార్యక్రమములను మహా స్వామి వారి ఆదేశానుసారం నిర్వహించుచున్నారు.

పై చెప్పిన ట్రస్టుకు సంబంధము లేని మరియు తొలగించబడిన పై 13 మంది సభ్యులు చట్టవ్యతిరేకముగా తీర్మానములు చేసి, సవరణ దస్తావేజులు సహా రిజిష్టర్ చేయగా అందుపై హై కోర్టు వారు స్టే సహా యిచ్చియున్నారు. అంతే గాక సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ వారు కూడా సదరు దస్తావేజులను అబయన్స్‌లో ఉంచినారు. పై 13 మంది సభ్యులకు షిర్డిసాయి కల్చరల్ ట్రస్ట్ మరియు మిషన్‌కు ఎటువంటి సంబంధములేదు. బాబా గారి సేవా కార్యక్రమముల సమయములో పై 13 మంది పీఠ మందిర భక్తులను భయభ్రాంతులను చేయుచూ స్వామి వారిపై అసత్య ప్రచారములు చేయుచూ, పై ట్రస్టుకు అన్ని విధములా నష్టము కలిగించుచున్నారు. అట్టి చర్యలు చట్టరీత్యా చెల్లవని పై తొలగించబడిన 13 మంది సభ్యులపై మా క్లయింటు తగిన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనగలరని యావన్మందికి తెలియజేయడమైనది.

ఒంగోలు
తేది : 16-06-2023

ఇట్లు : మురిపర్తి రాఘవరావు, AP 442 / 1979
పెట్యూరి వసుంధర, AP 2163 / 2010
అడ్వకేట్స్, సీతారాంపురం, ఒంగోలు.

లాసెట్‌లో మనోళ్ల సత్తా

- మూడేళ్ల కోర్సులో స్టేట్ రెండో ర్యాంకు,
- ఐదేళ్ల కోర్సులో స్టేట్ 3వ ర్యాంకు



కె.గంగాధర్, మూడేళ్ల కోర్సులో 2వ ర్యాంకు



ఎ.రవీంద్రాచారి, ఐదేళ్ల కోర్సులో 3వ ర్యాంకు



కాటూరి కోదండపాణి, 9వ ర్యాంకు

దర్శి/కొమరోలు: లా సెట్‌లో ప్రకాశం జిల్లావాసులు సత్తా చాటారు. లాసెట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. కొమరోలుకు చెందిన గంగినాయుడు, వెంకటరత్నమ్మ దంపతుల కుమారుడు కే గంగాధర్ మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఎంట్రన్స్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. గంగాధర్ ప్రస్తుతం గిద్దలూరు మండలం వెల్లుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో గంగాధర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టుకు కూడా ఎంపికయ్యాడు. దర్శిలో నివాసం ఉండే ఆలతుర్తి రవీంద్రాచారికి స్టేట్ 3వ ర్యాంక్ వచ్చింది. ఈ విద్యార్థి విజయవాడలోని శరత్ చంద్ర జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఐదు సంవత్సరాల బీఏ ఎల్ఎల్‌బీ ఎంట్రన్స్‌లో 3వ ర్యాంక్ సాధించాడు. రవీంద్రాచారి స్వగ్రామం మండలంలోని రామచంద్రాపురం. తల్లిదండ్రులు నరశింహాచారి, వరలక్ష్మమ్మలు చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తాను జడ్జ్ కావాలనే లక్ష్యంతో ఉన్నట్లు రవీంద్రాచారి తెలిపారు. రవీంద్రాచారిని కుటుంబసభ్యులు, స్నేహితులు అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి లా సెట్‌లో స్టేట్ 9వ ర్యాంకు

చీరాల అర్బన్: అతనొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఉద్యోగం చేస్తూనే న్యాయవాదిగా రాణించాలనే ఉద్దేశంతో స్వంతంగా లాసెట్‌కు సన్నద్ధమయ్యాడు. ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా చదువుకుని పరీక్ష రాశాడు. తీరా ఫలితాలు చూసుకుంటే స్టేట్ 9వ ర్యాంకు సాధించాడు. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన కాటూరి కోదండపాణి హైదరాబాద్‌లో విప్రోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ లాసెట్ రాశాడు. శుక్రవారం విడుదలైన లాసెట్ ఫలితాల్లో 91 మార్కులతో స్టేట్ 9వ ర్యాంకు సాధించాడు.

రెండు లారీలు ఢీ

- ముగ్గురికి తీవ్రగాయాలు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం
- లక్షల విలువైన టమోటాలు నేలపాలు

మార్టూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొట్టుకోవడంతో ఇద్దరు డ్రైవర్‌లు, ఒక క్లీనర్ గాయపడ్డారు. ఈఘటన శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కోనంకి ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. హైవే పెట్రోలింగ్ వాహనం ఇన్‌చార్జ్ నరసింహరావు, అంబులెన్స్ సిబ్బంది కోటేశ్వరరావు వివరాల మేరకు.. బెంగళూరు నుంచి కలకత్తాకు 800 టమోటా బాక్సులతో ఓ భారీ వాహనం వెళ్తోంది. కోనంకి ఫ్లైఓవర్ దిగే క్రమంలో డ్రైవర్ అశోక్ నిద్రమత్తు కారణంగా లారీ అదుపుతప్పి రహదారికి మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుకొని బీహార్ నుంచి కోయంబత్తూరుకు మిషనరీ తరలించే మరో లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు లారీలు మార్టూరు–ఒంగోలు రహదారికి అడ్డంగా పడిపోయాయి. ఈకారణంగా మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఏర్పడింది. ప్రమాద విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది బలికురవ 108 సిబ్బంది తక్షణమే ప్రమాదస్థలికి చేరుకున్నారు. ప్రమాదంలో టమోటా లారీ డ్రైవర్ అశోక్‌కు ఎడమ కాలికి గాయమైంది. ఒంగోలు వైపు వెళ్తున్న రెండో లారీ డ్రైవర్ రాజేష్‌కుమార్, క్లీనర్ శశికుమార్‌కు గాయాలు కావడంతో ముగ్గురిని మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్షల రూపాయిలు విలువైన టమోటా రోడ్డుపాలు కావడంతో స్థానికులు, వచ్చే పోయే ప్రయాణికులు దొరికిన వారు దొరికినట్లే తీసుకువెళ్లారు. హైవే సిబ్బంది క్రేన్‌ల సాయంతో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న రెండు వాహనాలను తీవ్రంగా శ్రమించి మధ్యాహ్నం లోపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1459]

Real Estate

BUILDING FOR SALE

■ ఒంగోలు రాజీవ్‌నగర్‌లో 30X62 కొలతలు గల 26 గదులలో వెస్ట్‌ఫేస్ 2 BHK బిల్డింగ్ అన్ని వసతులు గలది అమ్మబడును. సంప్ర॥ ✆ 96769 39411, 98858 62629. [O-786116]

TOLET/SALE

■ ఆటో మొబైల్ షోరూమ్ అద్దె/అమ్మకం: ఒంగోలు నగరంలో 4000 SFT ఏరియా గల ఆటో మొబైల్ షోరూమ్ అద్దెకు / అమ్మకమునకు కలదు. సం॥ ✆ 94937 19128. [O-787254]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర: ✆ 945 945 3338 [B-220]

HEALTH CARE

■ బట్టతల/ హెయిర్‌లాస్ మొ॥న అన్ని Hair Problems కి 2 గంటల్లోనే మీ ఇంటివద్దనే వచ్చి Hair Fixing చెయ్యబడును. ఏరియాలు వారికి ఏజెంట్లు కూడా సంప్రదించగలరు. 8142038308 [G-817]

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02856 90102 02762

Wanted

■ ఒంగోలులోని ప్రముఖ పిల్లల హాస్పిటల్ నందు పనిచేయుటకు ల్యాబ్‌టెక్నీషియన్స్(M) వెంటనే కావలెను. అనుభవంను బట్టి మంచి జీతం ఇవ్వబడును. సం॥ ✆ 81868 48298. [O-787256]

■ విజన్ ఆటోమొబైల్స్ అపె ఆటోషోరూం ప్రకాశం జిల్లా ఒంగోలు, మార్కాపురం, కందుకూరు, చీరాల, అద్దంకి నందు పనిచేయుటకు సేల్స్ మేనేజర్స్ -2, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-9 సర్వీసు మేనేజరు -1, సర్వీసు సూపర్ వైజర్లు-2, టెలికాలింగ్-2, అకౌంటెంట్-2, కావలెను. సంప్ర॥ ✆ 77999 10116, 7799910109,వాట్సాప్:9398201729.email: visionautomobiles.accts@gmail.com [OA-925]

■ రెయిన్‌బో డెంటల్ కేర్ హాస్పిటల్ - కర్నూల్ రోడ్ - ఒంగోలు నందు పనిచేయుటకు అసిస్టెంట్స్, PRO లు, రిసెప్షనిస్ట్ వెంటనే కావలెను. సంప్ర॥ ✆ 95339 69969 [O-787255]

■ ఒంగోలులోని ప్రముఖ విద్యా సంస్థ నందు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు JLS కావలెను. జీతం : 10 నుండి 15 వేలు సంప్ర॥ ✆ 85003 01111, 63995 52222 [OA-921]

■ కరెంట్ బిల్ రీడర్స్ కావలెను. అద్దంకి, పంగులూరు, మేదరమెట్లలో వర్క్‌చేయుటకు కరెంట్ బిల్ రీడర్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర॥ ✆ 80748 19229. [O-786112]

■ ప్రముఖ ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్ - ఒంగోలు నందు పనిచేయుటకు సేల్స్ రంగంలో అనుభవం గల సేల్స్‌పర్సన్స్(M), మెకానిక్స్ కావలెను. మంచి జీతం కలదు. సం॥ ✆ 93467 95196. [O-787253]

■ ఒంగోలులోని ప్రముఖ E/M హైస్కూల్‌లో ప్రైమరీ & హైస్కూల్‌లో అన్ని సబ్జక్టులకు టీచర్లు M/F, డ్రైవర్లు వెంటనే కావలెను. సంప్ర॥ ✆ 91770 14253, 77807 79680. [O-787252]

■ బ్యాంక్ అకౌంట్స్ OPEN చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. Q.ఇంటర్/డిగ్రీ (B.Tech) జీ॥15,000/- వివరాలకు సంప్ర॥ ✆ 99666 03707, 99858 95873. [O-786097]

■ విరాట్ సిస్టమ్స్ ఒంగోలు నందు లేడీ రిసెప్షనిస్టులు-3, ITI / డిప్లొమో అర్హత గల M/F -10 మంది, సేల్స్‌బాయ్స్ / గర్ల్స్-5, మార్కెటింగ్ పర్సన్స్-2 వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ కలవు. ✆ 92464 62940 [O-786101]

■ మేదరమెట్లలోని ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు హెల్పర్స్, సర్వర్స్ (వెయిటర్స్) వెంటనే కావలెను. ఫుడ్ రూమ్ ఇవ్వబడును. జీ॥ 15000/- అనుభవం గల వారికి ప్రాధాన్యత. ✆ 80960 30333 [O-786095]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ సె॥ గార్డ్స్, సూ॥వై॥ ప్రకాశం జిల్లాలో డ్యూటీ చేయుటకు అర్జంట్‌గా కావలెను. జీ: 12,000, 14,000/- PF, ESI, ఫ్రీ రూం + భోజనం. Q: 10 + 12th ✆ 94902 48039, 94903 80213 [B-786369]

■ నారాయణ రియల్ ఎస్టేట్‌లో పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను. జీతం: 15,000/-. సంప్రదించండి: 85006 19888, 97050 02191, 95537 81848 [L-799077]

■ బ్యాంక్‌లలో (ఆఫీస్ వర్క్స్) పర్మినెంట్‌గా Q: 10th- డిగ్రీ జీ॥ 26,000/- కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ @Ph: 8332809093 [H-781443]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమిషన్ 6K. Ph: 9640258899 [H-793444]

■ గుంటూరు మరియు ఒంగోలు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. ఉచిత వసతి సౌకర్యం కలదు. 9866618811, 9866618877 [G-246]

■ Wanted Teachers M/F to Teach 3rd - 8th Social, Hindi, Maths & English, 10th English, Social, P.E.T. ✆ 98491 07773. SriRam School, Sri Nagar- Ongole. [O-787251]

■ Wanted Teachers to teach in an English Medium School at Mudinepalli, Eluru District. Contact : ✆ 99494 11547, 95020 06580 [B-1166]

■ WANTED TEACHERS for Hindi, Maths, Social and PET Free Accommodation. Cont: 8639096944, 8142660770. [C-785862]

■ Wanted Residential P.E.T's, Wardens & Tutors to work at VBR Residential School, Dhanalakshmipuram, Nellore. Salary : 10k-15k with Free Food and Accommodation. Contact with Original Certificates. Cell : 81060 82922. [NA-132]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.